సాక్షి
కుమురం భీం
శనివారం : 21 : డిసెంబర్ : 2024



గురుకులం పిలుస్తోంది..

గురుకుల విద్యాసంస్థల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించనున్న ఉమ్మడి ప్రవేశపరీక్ష నోటిఫికేషన్ విడుదలైంది. ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 8లో▸



కౌటాలలో నిత్యం ట్రాఫిక్

కౌటాల శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. రోడ్లు మాత్రం అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఇరుకుగా ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
29.1 /16.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది. ఉదయం పొగమంచు ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

అక్రమంగా వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఎవరైనా అక్రమంగా చట్టవ్యతిరేకంగా వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ డీవీ శ్రీనివాస రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ నుంచి ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను అక్రమంగా విక్రయిస్తున్న 44 కేసుల్లో 59 మందిని అరెస్టు చేశామని తెలిపారు. రికవరీ చేసిన గుట్కా విలువ రూ.38,38,152 ఉంటుందని పేర్కొన్నారు. అలాగే పీడీఎస్ బియ్యం, ఇసుక, గంజాయి వ్యాపారులు అడ్డుకునేందుకు సరిహద్దు వెంట చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నామని వివరించారు. నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమ రవాణాకు సహకరిస్తే సిబ్బందిపైనా శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వివరాల నమోదుపై శిక్షణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సీతారాం

ఆసిఫాబాద్‌అర్బన్: కుష్ఠు నిర్ధారణ పద్ధతులు, నికుష్ఠ 2.0 యాప్‌లో వివరాల నమోదుపై సిబ్బందికి జిల్లా కేంద్రంలో శుక్రవారం శిక్షణ అందించారు. డీఎంహెచ్‌వో సీతారాం మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న లెప్రసీ నోడల్ పర్సన్లు, డాటా ఎంట్రీ సిబ్బందికి లెప్రా సొసైటీ(హైదరాబాద్) ఆధ్వర్యంలో అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి అజీముద్దీన్, ఇన్‌చార్జి డీపీఎంవో ఇస్లావత్ శ్యాంలాల్, జిల్లా రెఫరల్ సెంటర్ శిక్షకులు రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోగా 'ఇందిరమ్మ' సర్వే పూర్తిచేయాలి



సర్వే వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్: ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే గడువులోగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజంపేటలో చేపట్టిన సర్వేను శుక్రవారం పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు యాప్‌లో సక్రమంగా నమోదు చేయాలన్నారు. ప్రతీ 500 ఇళ్లకు ఒక సర్వే అధికారిని నియమించామని తెలిపారు. నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తి చేసి లబ్ధిదారులను గుర్తించాలని ఆదేశించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ప్రయాణికులే ఆర్టీసీకి అండ

ఆసిఫాబాద్: ప్రయాణికులే ఆర్టీసీకి అండ అని ఆసిఫాబాద్ డీఎం విశ్వనాథ్ అన్నారు. ప్రయాణికుల మర్యాద దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలో బస్సుల్లో ప్రయాణిస్తున్న వారికి గులాబీ పూలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులతో డ్రైవర్, కండక్టర్లు మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ప్రయాణికుల ఆదరణతోనే ఆర్టీసీ సంస్థ ముందడుగు వేస్తుందన్నారు. సంస్థ మనుగడకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన వెంట సిబ్బంది బాబురావు ఉన్నారు.

బతుకమ్మ ఆడుతూ నిరసన



బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సమ్మెలో భాగంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు శుక్రవారం బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక మాట్లాడుతూ 11 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. శనివారం కలెక్టరేట్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, కేవీపీఎస్, డీవైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. విద్యార్థులు నష్టపోకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు తుకారాం, మోహన్, సంతోష్, రాజేశ్, ప్రశాంత్, నాయకులు కార్తీక్, దినకర్, తిరుపతి, చిరంజీవి, టీకానంద్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుట్కాపై నజర్..!



- ఈ ఏడాది మేలో నిషేధం విధించిన రాష్ట్ర ప్రభుత్వం
- అక్రమ రవాణాపై పోలీసుల ఉక్కుపాదం
- సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు
- ఆరు నెలల్లో రూ.38.38 లక్షల విలువైన గుట్కా పట్టివేత

గుట్కా తినడం, మద్యం తాగడం ఆరోగ్యానికి హానికరమని జగమెరిగిన సత్యం. అయినా మత్తు పదార్థాలకు అలవాటు పడిన కొంతమంది ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారు. కాలేయ, గొంతు, నోటి క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో గుట్కా నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా పోలీస్‌శాఖ నిఘా పెంచింది.

కౌటాల(సిర్పూర్): మహారాష్ట్ర సరిహద్దున ఉన్న జిల్లాలో గుట్కా వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. పొగాకు ఉత్పత్తులతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కన్నా.. వాటి బారినపడి అనారోగ్యానికి గురయ్యే వారు ఆస్పత్రుల్లో చేస్తున్న ఖర్చు అధికంగా ఉంటుంది. యువతతోపాటు వృద్ధులు చాలామంది ఈ వ్యసనానికి అలవాటు పడ్డారు. సమీపంలోని మహారాష్ట్రలో గుట్కా వినియోగం జోరుగా సాగుతుంటుంది. ఈ క్రమంలో సరిహద్దుగా ఉన్న గ్రామాల ప్రజలు గుట్కా(కర్ర), పొగాకు ఉత్పత్తుల వినియోగానికి బానిసలుగా మారారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మే నెలలో ఏడాది పాటు నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అదే అదునుగా కొందరు వ్యాపారులు గుట్కాను అధిక ధరలకు విక్రయిస్తూ లబ్ధి పొందుతున్నారు. మహారాష్ట్ర నుంచి అక్రమంగా జిల్లాలోకి గుట్కా ప్యాకెట్లను సరఫరా చేస్తూ యథేచ్ఛగా విక్రయాలు సాగిస్తున్నారు.

విచ్చలవిడిగా వినియోగం

ఆహార, భద్రత ప్రమాణాల చట్టం ప్రకారం ప్రజల ఆరోగ్యం దృష్ట్యా గుట్కా, పాన్ మసాలాల తయారీ, నిల్వ, సరఫరా, విక్రయాలు నిలిపివేయాలని గత మే 24న రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఏడాది పాటు రాష్ట్రంలో ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని స్పష్టం చేసింది. కానీ కాగజ్‌నగర్ పట్టణంలో గుట్కా వ్యాపారంలో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడిస్తున్న గుట్కా మాఫియా వ్యాపారాన్ని వదులుకోవడానికి మాత్రం ఇష్టపడడం లేదు. నిషేధిత గుట్కా వ్యాపారాన్ని మరింత సీరియస్‌గా తీసుకొని ప్రతినెలా రూ.లక్షలు సంపాదిస్తున్నారు. గతంలో ఉన్నవారే ఇప్పటికీ ఈ దందా నడుపుతున్నారు. పోలీసులే చాలామంది గుట్కాకు అలవాటు పడినట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి. పట్టణాలు, పల్లెల్లో వినియోగం అడ్డూఅదుపు లేకుండా సాగుతోంది.

పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి

జిల్లావ్యాప్తంగా గుట్కా వ్యాపారం రోజులో సుమారు రూ.50 లక్షలకు పైగా ఉంటుందని అంచనా. సగటున ఒకరు రోజులో సుమారుగా 4 నుంచి 10 వరకు ప్యాకెట్లు వినియోగిస్తున్నారు. పొగాకు, ఖైనీ, కర్రా, గుట్కా ఇలా పలు రూపాల్లో లభిస్తోంది. గుట్కాపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించడంతో జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక నిఘా సారించింది. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. సిర్పూర్(టి) మండలం హుడ్కిలి, వెంకట్రావ్‌పేట, చింతలమానెపల్లి మండలం గూడెం, వాంకిడి మండల కేంద్రం సరిహద్దులో చెక్‌పోస్టులు కొనసాగుతున్నాయి. గత ఆరు నెలల్లో జిల్లావ్యాప్తంగా అక్రమంగా గుట్కా విక్రయిస్తున్న 44 కేసుల్లో 59 మందిని అరెస్టు చేశారు. రూ.38,38,152 విలువైన నిషేధిత గుట్కా స్వాధీనం చేసుకున్నారు. కాగజ్‌నగర్ నుంచే మంచిర్యాల, ఇతర పట్టణాలకు సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. అయితే పోలీసులు నిఘా పెట్టినా ఇంకా అనేక గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు సాగుతున్నట్లు సమాచారం.

అవగాహన లేక అనారోగ్యం పాలు

'గుట్కా తినడం ఆరోగ్యానికి హానికరం.. పొగాకు ఉత్పత్తుల సేవనం ద్వారా ఎన్నో అనర్థాలున్నాయి' సినిమా థియేటర్లలో స్క్రీన్‌పై ప్రదర్శించే ప్రకటన ఇది. గుట్కా, పొగాకు ఉత్పత్తుల ద్వారా కలిగే అనర్థాలపై ప్రభుత్వాలు ప్రచారం నిర్వహించినా వినియోగం మాత్రం తగ్గడం లేదు. దుష్పరిణామాలపై అవగాహన లేకపోవడంతో అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. అలాగే బహిరంగ ప్రదేశాలు, ఎక్కడ పడితే అక్కడే నమిలి ఉమ్మివేస్తుండడంతో అపరిశుభ్రత నెలకొంటుంది. కాలేయం, నోటి క్యాన్సర్, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. గుట్కా దుష్ప్రభావాలపై గ్రామీణులకు పోలీసులు, వైద్యారోగ్య శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ఆరోగ్యానికి హానికరం



ఆస్పత్రికి వచ్చే రోగుల్లో చాలామంది గుట్కా(కర్రా) నములుతూ వస్తారు. గుట్కా తింటే అనారోగ్యానికి హానికరం అని చెప్పినా పెడచెవిన పెడుతున్నారు. స్థానికంగా గుట్కా తినే అలవాటు చాలా మందికి ఉంది. రైతులు, యువకులు వ్యాధులు కొనితెచ్చుకుంటున్నారు. నోటితో పాటు కడుపులో పుండ్లు ఏర్పడే అవకాశం ఉంది.

– సుమిత్, వైద్యుడు, కౌటాల

ఉక్కుపాదం మోపుతాం



గుట్కా విక్రయాలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. కిరాణాలు, పాన్ షాపుల్లో విక్రయించడం నేరం. నిషేధిత మత్తు పదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లాలో గుట్కాను విక్రయించే వారిపై ఆరు నెలల్లో అనేక కేసులు నమోదు చేశాం. అన్ని దుకాణాల్లో తరచూ తనిఖీలు చేపడుతాం. గుట్కా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం.

– డీవీ శ్రీనివాసరావు, ఎస్పీ

రాలిన మరో విద్యాకుసుమం



ఆస్పత్రిలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు



వెంకటలక్ష్మి మృతదేహం

- అనారోగ్యంతో డీఈడీ విద్యార్థిని మృతి
- నెల రోజుల వ్యవధిలో రెండో ఘటన

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో మరో విద్యాకుసుమం ప్రాణాలు కోల్పోయింది. నెల రోజుల వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థినులు మృత్యువాత పడడం ఆందోళన కలిగిస్తోంది. నవంబర్ 25న వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన బాలికల వసతిగృహంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని చౌదరి శైలజ(14) అస్వస్థతకు గురై నిమ్స్‌లో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.. తాజాగా జిల్లా కేంద్రంలోని బీసీ వసతి గృహంలో ఉంటూ స్థానిక ప్రైవేట్ డీఈడీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న తొర్రం వెంకటలక్ష్మి(19) అనారోగ్యంతో మృతిచెందింది.

వారం క్రితమే హాస్టల్‌కు..

బెజ్జూర్ మండలం అందుగులపల్లి గ్రామానికి చెందిన మధునబాయి, పోశాలు దంపతులకు నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోశాలు గతంలో మృతిచెందాడు. చిన్న కుమార్తె వెంకటలక్ష్మి ఆసిఫాబాద్ పట్టణంలోని శ్రీనిధి కళాశాలలో డీఈడీ చదువుతోంది. స్థానిక బీసీ పోస్ట్ మెట్రిక్ వసతిగృహంలో అడ్మిషన్ కూడా తీసుకుంది. అయితే ఆరోగ్యం సహకరించకపోవడంతో కాగజ్‌నగర్ పట్టణంలోని బంధువుల ఇంటి నుంచి రాకపోకలు సాగిస్తోంది. ఈ నెల 18 నుంచి 24 వరకు డీఈడీ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు ఉండటంతో మళ్లీ వారం క్రితమే హాస్టల్‌కు వచ్చింది. అక్కడి భోజనం నచ్చకపోవడంతో ఎక్కువగా బయటి నుంచి పండ్లు తెచ్చుకుంటుంది. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు తలనొప్పిగా ఉందని చెప్పి ఒక్కసారిగా కిందపడిపోయింది. సిబ్బంది 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందింది. అయితే వెంకటలక్ష్మి అనారోగ్యంతో ఉన్న విషయం తమకు తెలియజేయలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. 'నా కూతురు వారం క్రితమే ఇక్కడికి వచ్చింది.. సిబ్బంది మాకు ఏం చెప్పలేదు. తెలిస్తే మా బిడ్డను కాపాడుకునేవాళ్లం' అని విద్యార్థిని తల్లి రోదించిన తీరు అక్కడి వారిని కన్నీళ్లు పెట్టించింది. శనివారం పోస్టుమార్టం నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. కాగా.. విద్యార్థిని మృతి చెందిన సమయంలో హాస్టల్ వార్డెన్ కూడా అందుబాటులో లేరు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినా.. సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లినా విద్యార్థిని ప్రాణాలు దక్కేవని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. మరోవైపు డీఈడీ విద్యార్థిని వెంకటలక్ష్మి అనారోగ్యం బాధపడుతూ మృతి చెందిందని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి సీజవన్ ఒక ప్రకటనలో తెలిపారు.

గిరిజనులకు చదువే ఆయుధం


- డీఎస్పీ కరుణాకర్



దుప్పట్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ కరుణాకర్

రెబ్బెన(ఆసిఫాబాద్): గిరిజన ప్రజలకు చదువే ఆయుధం వంటిదని డీఎస్పీ కరుణాకర్ అన్నారు. రెబ్బెన మండలం గోలేటి గ్రామ పంచాయతీ పరిధిలోని గోండుగూడలో శుక్రవారం రాత్రి మీకోసం పోలీసులు కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మోడల్ స్కూల్స్, గిరిజన, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. స్థానిక విద్యార్థులతో భర్తీ కాని సీట్లను పక్క జిల్లాల విద్యార్థులతో భర్తీ చేస్తున్నారన్నారు. ఆదివాసీ, గిరిజన ప్రజల అభివృద్ధి చదువుతోనే సాధ్యమని పేర్కొన్నారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత వ్యక్తుల కాల్స్, సందేశాలకు స్పందించవద్దని సూచించారు. సైబర్ మోసాల బారినపడితే 1930 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. అపరిచిత వ్యక్తులకు ఎట్టి పరిస్థితిలోనూ ఆశ్రయం కల్పించవద్దని కోరారు. మద్యం, ఇతర వ్యసనాలకు యువత దూరంగా ఉండాలన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమస్యలుంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ బుద్దె స్వామి, రెబ్బెన ఎస్సై డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీఎం కప్ పోటీలు



హ్యాండ్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

- రాష్ట్రస్థాయికి 403 మంది ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలలో మూడు రోజులుగా కొనసాగుతున్న సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు శుక్రవారం ముగిశాయి. పోటీలు హోరాహోరీగా కొనసాగగా, విజేతలకు డీఎస్‌వో మీనారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. 15 మండలాల నుంచి 3000 మంది క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. వీరిలో ప్రతిభ చూపిన 403 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశామన్నారు. కబడ్డీలో 24 మంది, ఖోఖోలో 30 మంది, అథ్లెటిక్స్‌లో 46, వాలీబాల్ 24, అత్యపత్యా 24, వాలీబాల్ 24, బ్యాడ్మింటన్ 6, ఫుట్‌బాల్ 36, సాఫ్ట్‌బాల్ 26, బేస్‌బాల్ 36, బాక్సింగ్ 8, స్విమ్మింగ్ 8, కరాటే 21, యోగా 9, చెస్ 9, కిక్‌బాక్సింగ్ 18 మందితోపాటు వివిధ క్రీడల్లో 63 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశామని వెల్లడించారు. ఏసీఎంవో ఉద్ధవ్, కోచ్‌లు విద్యాసాగర్, తిరుమల్, పీడీ పీఈటీ మధుసూదన్, రాకేశ్, రమేశ్, వెంకటేశ్, బిక్కు, అంజలి పాల్గొన్నారు.



కబడ్డీలో విజేతగా నిలిచిన వాంకిడి బాలికల జట్టు



ఖోఖో విజేత ఆసిఫాబాద్ జట్టు

నూతన మెనూ తప్పనిసరిగా పాటించాలి


- అదనపు కలెక్టర్ డేవిడ్



సరుకులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్, పక్కన డీటీడీవో రమాదేవి

వాంకిడి(ఆసిఫాబాద్): వసతిగృహాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన నూతన మెనూను తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) డేవిడ్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం డీటీడీవో రమాదేవితో కలిసి తనిఖీ చేశారు. వంటగదితో పాటు పరిసరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, పోషకాహారం వడ్డించాలని తెలిపారు. నిత్యం పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, పరీక్షలు నిర్వహిస్తూ వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలు తెలుసుకున్నారు. ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని అన్నారు. విద్యార్థుల హాజరుశాతం, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి సంజీవన్, డీసీఎస్‌వో వినోద్, తహసీల్దార్ రియాజ్ అలీ, సిబ్బంది ఉన్నారు.

మరో చాన్స్



ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది (ఫైల్)

- ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుకు అవకాశం
- మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో స్వీకరణ

ఆసిఫాబాద్/కై లాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం జిల్లాలో ఇప్పటికే క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్నారు. ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తుదారుల వివరాలు నమోదు చేస్తున్నారు. అయితే ఇళ్లు పొందేందుకు అర్హులై ఉండి వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకోలేని వారిలో ఆందోళన వ్యక్తమవుతుంది. ఈ క్రమంలో ప్రభుత్వం వారికి మరో అవకాశం కల్పించాలని నిర్ణయించింది. ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపాలిటీల్లోని ప్రత్యేక ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు చేస్తుంది. ఈ నిర్ణయంపై అర్హులైన వారిలో హర్షం వ్యక్తమవుతుంది.

ఇళ్ల కోసం 1,54,136 దరఖాస్తులు

ఏడాది క్రితం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమల్లో భాగంగా అభయహస్తం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, చేయూతతో పాటు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులను స్వీకరించింది. గతేడాది డిసెంబర్ 28నుంచి ఈ ఏడాది జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమం కింద ఈ కార్యక్రమం కొనసాగింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 1,63,647 దరఖాస్తులు రాగా, వీటిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,54,136 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం ఈ దరఖాస్తుదారులకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఇంటింటి సర్వే నిర్వహిస్తోంది. ఇందుకోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించింది. పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది ఈ నెల 9 నుంచి తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి అర్హులైన వారి వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నెలాఖరు వరకు సర్వే పూర్తి చేసేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఏటా నియోజకవర్గానికి 3500 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 7,000 ఇళ్లు నిర్మించే అవకాశం ఉంది.

వారికి మరో అవకాశం

గతంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకోలేని పేదలకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. సొంతింటి స్థలం కలిగి, ఇళ్లు లేని నిరుపేదలు అర్హులు. గ్రామీణ ప్రాంతాల్లోని వారు సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో, పట్టణ పరిధిలోని ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజాపాలన కేంద్రాలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం ప్రజాపాలన వెబ్‌సైట్ అందుబాటులో లేకపోవడంతో కేవలం దరఖాస్తులను మాత్రమే స్వీకరించనున్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చు

లబ్ధిదారులను గుర్తించేందుకు జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. సర్వే ప్రక్రియ 15 నుంచి 20 రోజుల్లో పూర్తి చేయాలి. ఇప్పటి వరకు సుమారు 40 వేల దరఖాస్తులను యాప్‌లో అప్‌లోడ్ చేశాం. గతంలో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోలేని వారు సంబంధిత ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చు. ప్రస్తుతం ప్రజాపాలన వెబ్‌సైట్ అందుబాటులో లేకపోవడంతో మ్యాన్యువల్‌గా స్వీకరించి భద్రపరుస్తాం. ప్రభుత్వం ఎప్పుడు వెబ్‌సైట్ ఓపెన్ చేసి అనుమతిస్తే అప్పుడు వాటి వివరాలను ఆన్‌లైన్ చేస్తాం.

– దీపక్ తివారి, అదనపు కలెక్టర్

రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాలి



క్రీడాకారులతో పలు అసోసియేషన్ల సభ్యులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించాలని జిల్లా క్రీడల అధికారి మీనారెడ్డి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లో శుక్రవారం సీఎం కప్ జిల్లాస్థాయి చెస్, సెపక్‌తక్రా, బాల్ బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు క్రమశిక్షణతో ఉంటూ క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని అన్నారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులు సైతం రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించేందుకు సీఎంకప్ పోటీలను వేదికగా మార్చుకోవాలని సూచించారు. ప్రతీ క్రీడాకారుడు తోటివారితో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీఎఫ్ వెంకటేశ్, సింగరేణి పాఠశాల హెచ్ఎం రవితేజ, సెపక్‌తక్రా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భాస్కర్, బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, సెపక్‌తక్రా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లేశ్, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సామిల్ల సంపత్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాసరలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పూజలు



పూజలో పాల్గొన్న కుటుంబ సభ్యులు

బాసర: బాసరలో శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని శుక్రవారం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు చేశారు. అర్చకుడు ప్రవీణ్ పాటక్ ఆధ్వర్యంలో ఆయన మనుమడు శ్రీరామ దేవేందర్‌రెడ్డికి అక్షరాభ్యాసం నిర్వహించారు. ఆలయ అధికారులు ముందుగా వారికి స్వాగతం పలికారు. పూజలు అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. తహసీల్దార్ పవన్‌చంద్ర, పోలీసులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

కలప పట్టివేత



పట్టుబడ్డ కలప

నస్పూర్: పట్టణ పరిధిలో విలేజ్ శ్రీరాంపూర్‌లోని ఓ విస్తారాకుల తయారీ ఫ్యాక్టరీలో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను హైదరాబాద్ ఫారెస్టు విజిలెన్స్, మంచిర్యాల ఫారెస్టు ఫ్లైయింగ్ స్క్వాడ్, ఫారెస్టు అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు ఫ్యాక్టరీపై దాడి చేసి, కలపను స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ అధికారి నరేందర్ తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 3 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. మంచిర్యాల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి రమాదేవి, మంచిర్యాల ఫారెస్టు రేంజ్ అధికారి రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

గుడిహత్నూర్: మండలంలోని మాన్కాపూర్‌లో కుమ్ర హన్మంతు ఇంట్లో గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు హన్మంతు ఇంటిని శుక్రవారం సోదా చేయగా రూ.20వేల విలువ చేసే 800 గ్రాముల గంజాయి లభ్యమైంది. గ్రామ సమీపంలో ఉన్న తన చేనులో గంజాయి సాగైనట్లు తన అవసరానికి దీన్ని విక్రయించడానికి ఉంచినట్లు హన్మంతు అంగీకరించారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

బోథ్: మండలంలోని పొచ్చెర బస్టాండ్ సమీపంలో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ వెంకటేశ్వర రావు, ఎస్సై ప్రవీణ్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. బోథ్ నుంచి పొచ్చెర జలపాతం వరకు శుక్రవారం ఉదయం ఎస్సైతోపాటు ముగ్గురు కానిస్టేబుళ్లు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. పొచ్చెర బస్టాండ్ వద్ద బస్సి చందర్ సింగ్ అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులను చూసి పరుగులు తీయగా ఎస్సై పట్టుకున్నాడు. అతని వద్ద ఉన్న నల్లని కవర్‌లో చూడగా 480 గ్రాముల గంజాయి లభ్యమైంది. దీని విలువ రూ.12 వేలు ఉంటుంది. నిందితుడు బస్సి చందర్ సింగ్‌ది నేరడిగొండ మండలం బుద్దికొండ పంచాయతీ పరిధిలో గల రాజులతండా గ్రామం. అతన్ని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. గంజాయిని ఎవరికి సరఫరా చేస్తున్నారో విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.

గురుకులం పిలుస్తోంది..

- 5వ తరగతిలో ప్రవేశాలకు ఆహ్వానం
- ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తుకు గడువు
- 23న ప్రవేశపరీక్ష



బెల్లంపల్లిలోని జనరల్ బాలుర గురుకుల పాఠశాల

బెల్లంపల్లి: ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించనున్న ఉమ్మడి ప్రవేశపరీక్ష (వీటీజీ సెట్) నోటిఫికేషన్ విడుదలైంది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) కార్యదర్శి, చీఫ్ కన్వీనర్ అలగు వర్షిణి నోటిఫికేషన్‌ను జారీ చేశారు. దీని ఆధారంగా ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించిన మెరిట్ విద్యార్థులకు 2025–26 విద్యా సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ప్రవేశం కల్పిస్తారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఆంగ్లమాధ్యమంలో మెరుగైన విద్యాబోధన చేపడుతారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీస్తూ వారిని సన్నద్ధం చేయనున్నారు.

ప్రవేశం కల్పించనున్న గురుకులాలివే..

వీటీజీ సెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి గురుకుల విద్యాసంస్థల్లో అడ్మిషన్ కల్పిస్తారు. మెరిట్ మార్కుల ప్రాతిపదికన టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, టీజీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, టీజీఆర్‌ఈఐఎస్ (ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్) ఆయా సంక్షేమ శాఖల ద్వారా నిర్వహిస్తున్న గురుకులాలకు ఎంపిక చేస్తారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉచిత భోజన, వసతి ఇతర సౌకర్యాలు కల్పిస్తారు. గురుకుల విద్యాసంస్థల్లో ఏటా ఉమ్మడి ప్రవేశపరీక్షకు లక్షలాది విద్యార్థులు పోటీపడటం జరుగుతోంది. ఈసారి కూడా మరింత పోటీ ఉండే అవకాశాలు ఉన్నాయి.

ఫిబ్రవరి 1 దరఖాస్తుకు అవకాశం

ఉమ్మడి గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి విద్యార్థులు ఈనెల 21 నుంచి వచ్చే ఏడాది (2025) ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తు చేసుకోవడానికి తుది గడువు విధించారు. ఆన్‌లైన్‌లో రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఒక సెల్ నంబర్‌తో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవల్సి ఉంటుంది. విద్యార్థుల ఎంపికకు పాత జిల్లా ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తమకు బదులు వేరే వారి ఫొటోలు పెట్టి దరఖాస్తు చేసినట్లయితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారు.

ఉమ్మడి జిల్లాలోని గురుకులాలు

జిల్లా	గురుకుల సొసైటీ	గురుకులాలు
మంచిర్యాల	టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్	09
మంచిర్యాల	ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	08
మంచిర్యాల	టీజీఆర్‌ఈఐఎస్	01
కుమురం భీం	టీజీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	10
కుమురం భీం	టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్	05
కుమురం భీం	ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	05
ఆదిలాబాద్	టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్	03
ఆదిలాబాద్	ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	06
ఆదిలాబాద్	టీజీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	13
నిర్మల్	టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్	05
నిర్మల్	ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	07
నిర్మల్	టీజీఆర్‌ఈఐఎస్	01
నిర్మల్	టీజీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	01

23న ప్రవేశపరీక్ష

ఉమ్మడి గురుకులాల్లో నిర్వహించే ప్రవేశపరీక్ష వచ్చే ఏడాది ఫిబ్రవరి 23న ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు.

ఒక్కో గురుకులంలో 80 సీట్ల చొప్పున..

ఆయా గురుకుల విద్యాసంస్థల్లో ఐదో తరగతిలో ఏ,బీ సెక్షన్లు ఉన్నాయి. ఒక్కో సెక్షన్‌కు 40 మంది చొప్పున విద్యార్థులకు అడ్మిషన్ కల్పిస్తారు. ఆ ప్రాతిపదికన ఒక్కో గురుకులంలో రెండు సెక్షన్లను కలిపి గరిష్టంగా 80 సీట్లు భర్తీ చేస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 74 గురుకుల విద్యాసంస్థలు ఉండగా వీటన్నింటిలో కలిపి మొత్తం 5,920 మంది విద్యార్థులు ప్రవేశం పొందడానికి అవకాశాలు ఉన్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి



ఐదో తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి నోటిఫికేషన్ వచ్చేసింది. ప్రస్తుతం నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – డి.శ్రీధర్, సంక్షేమ బాలుర గురుకుల సీవోఈ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, బెల్లంపల్లి

డ్రైవర్‌కు అస్వస్థత.. అదుపుతప్పిన బస్సు

- మోటార్‌సైకిళ్లు, కార్లను ఢీకొట్టి..
- ఒకరికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన వాహనాలు

మంచిర్యాలక్రైం: ఆర్టీసీ బస్సు నడుపుతున్న డ్రైవర్ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. స్టీరింగ్‌పైనే పడిపోవడంతో బస్సు అదుపు తప్పి రెండు కార్లు, ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని డిపోకు చెందిన బస్సు(టీఎస్ 02 జడ్ 0318) శుక్రవారం మధ్యాహ్నం మంచిర్యాల నుంచి కరీంనగర్‌కు వెళ్తోంది. పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తా, ఐబీ చౌరస్తా రోడ్డు మధ్యలోకి రాగానే డ్రైవర్ లొకిని ఎల్లయ్య బస్సు నడుపుతూనే ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురై స్టీరింగ్‌పై పడిపోయాడు. దీంతో బస్సు అదుపుతప్పి మోర్ మార్కెట్ ఎదురుగా ఉన్న రోడ్డులో పలు వాహనాలను ఢీకొట్టింది. మొదటగా స్కూటీని ఢీకొట్టి పక్కన నిలిపి ఉంచిన రెండు కార్లు, మరో రెండు ద్విచక్ర వాహనాలపైకి దూసుకెళ్లడంతో దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో స్కూటీ నడుపుతున్న చింతపండువాడకు చెందిన చింతపండు సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ ఎల్లయ్య త్వరగానే కోలుకుని బస్సును అదుపులోకి తెచ్చినట్లు ప్రయాణికులు తెలిపారు. అనంతరం డ్రైవర్‌ను కూడా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాద విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంచిర్యాల సీఐ తెలిపారు.

సీఎం కప్ రెజ్లింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో రెజ్లింగ్‌లో ముల్కల్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 60 కిలోల రెజ్లింగ్ పోటీల విభాగంలో పదో తరగతి విద్యార్థి అలుగునూరి అఖిల్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, మొగిళ్ల చందు ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించారు. వీరితోపాటు పీడీ శ్రీకాంత్, పీఈటీ కిరణ్‌లను పాఠశాల ప్రిన్సిపాల్ కుమ్మరి మోహన్, వైస్ ప్రిన్సిపాళ్లు నగేశ్, రమ్యరాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎనిమిది మంది బైండోవర్

కాసిపేట: మండలంలోని వరిపేట శివారులో పేకాట ఆడుతూ పట్టుబడిన ఎనిమిది మందిని అరెస్టు చేసి తహసీల్దార్ భోజన్న ఎదుట శుక్రవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం సా యంత్రం పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేయగా ముగ్గురిని పట్టుకోగా, పరారీలో ఉన్న ఐదుగురిని అదుపులో తీసుకుని బైండోవర్ చేశారు.

20 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు

- చోరీకి గురైన ఆటో స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఆటో, నిందితులతో పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో గురువారం చోరీకి గురైన ఆటో కేసును టూటౌన్ పోలీసులు 20 గంటల్లోనే ఛేదించారు. పట్టణంలోని నెహ్రూ చౌక్‌లో శుక్రవారం వాహనాల తనిఖీలు చేస్తుండగా రాంనగర్‌కు చెందిన షేక్ అబ్దుల్, షేక్ అమాన్‌లు ఆటోను విక్రయించేందుకు మహారాష్ట్రలోని కిన్వట్‌కు వెళ్తుండగా పట్టుకున్నారు. ఇదివరకే వీరిపై జైనథ్, గాదిగూడ, మావల పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. జల్సాలకు అలవాటుపడ్డ ఇద్దరు చోరీలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. షేక్ అమాన్ గత జూన్‌లో మావల పోలీసు స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో రూ.20వేల దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. వీరిని విచారించగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. కాగా, కేసును ఛేదించిన టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్, ఐడీ పార్టీ నరేశ్, క్రాంతి, గోపాల్, సుధాకర్ రెడ్డి, నరేందర్‌లను ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అభినందించారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

భైంసాటౌన్: అదనపు కట్నం కోసం భార్యను హతమార్చిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ నిర్మల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ తీర్పు ఇచ్చినట్లు పట్టణ సీఐ గోపినాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని పంజేషాగల్లికి చెందిన మహ్మద్ ముజమ్మిల్‌కు నిజామాబాద్‌కు చెందిన నాజియా సుల్తానాతో వివాహం కాగా, మద్యానికి బానిసగా మారి తరచూ అదనపు కట్నం కోసం వేధించేవాడు. దీంతో ఆమె తన పుట్టింటికి వెళ్లి కొంత నగదు తెచ్చేది. వేధింపులు ఎక్కువ కావడంతో పెద్దల సమక్షంలో నచ్చజెప్పారు. అయినా మళ్లీ వేధించడంతో ఆమె తన పుట్టింటి నుంచి డబ్బులు తేలేదు. ఈక్రమంలో ఆమెపై కక్ష పెంచుకున్న భర్త 2020 జనవరి 1న ఉదయం ఆమె ఒంటిపై డీజిల్ పోసి నిప్పంటించాడు. అనంతరం చికిత్స పొందుతూ మృతి చెందింది. శుక్రవారం కేసు విచారణకు రాగా, నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవితఖైదు శిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.


డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడినవారికి శిక్ష



బస్టాండ్‌లో క్లీనింగ్ పనులు చేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పాతమంచిర్యాల: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జిల్లా సెకండ్‌క్లాస్ అడిషనల్ మెజిస్ట్రేట్ కె.నిరోష శుక్రవారం శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. నలుగురిని బస్టాండ్ క్లీనింగ్‌లో చేయించాలని, 14 మందికి ట్రాఫిక్ అసిస్టెంట్ విధులు, ఎనిమిది మందికి జరిమానా విధించారని పేర్కొన్నారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి



రాములు (ఫైల్)

భీమిని: మండలంలోని ఖర్జీభీంపూర్ గ్రామానికి చెందిన జనగామ రాములు (37) పాముకాటుతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. అక్కలపల్లిలో పెళ్లి కార్యక్రమం కోసం రాములు గురువారం టెంట్ వేయడానికి వెళ్లాడు. రాత్రి కావడంతో పడుకున్నాడు. అర్ధరాత్రి దాటినా తర్వాత పాముకాటేసింది. అక్కడ ఉన్న స్థానికులు కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ అస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలిస్తుండగా మృతిచెందాడు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మృతుడికి కుమార్తె ప్రవస్తి, కుమారుడు నవతేజ్ ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

కాసిపేట: పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు దేవాపూర్ ఎస్సై అంజనేయులు తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని దేవాపూర్ మద్దిమాడకు చెందిన భూనేని సంజీవ్(40) ఓరియంట్ మాజీ పర్మినెంట్ ఉద్యోగి. సంజీవ్ కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈక్రమంలో తన ఉద్యోగాన్ని భార్యకు పెట్టించాడు. ఎంతకీ కేన్సర్ వ్యాధి నయం కాకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈనెల 18న గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిట్టి మెదళ్లకు గొప్ప ఆలోచన



పేపర్‌తో తయారు చేసిన బ్యాగులతో విద్యార్థులు, ఎంఈవో పరమేశ్వర్

సోన్: మండలంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల చిట్టి మెదళ్లకు గొప్ప ఆలోచన కలిగిందని ఎంఈవో తొడిశెట్టి పరమేశ్వర్ అన్నారు. ఇంట్లో ప్లాస్టిక్ సంచులు, వాడిన పాత వార్తపత్రికలు, పనికిరాని కాగితాలతో విద్యార్థులు పేపర్ బ్యాగులు తయారుచేసి పాఠశాలలో శుక్రవారం ప్రదర్శించారు. తమ ఇళ్లల్లో ప్లాస్టిక్ సంచులకు బదులుగా పేపర్ బ్యాగులు మాత్రమే వాడతామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారిని ఎంఈవో అభినందించారు. ఉపాధ్యాయులు రమేశ్‌బాబు, మంగమ్మ, శైలజ, విజయవాణి, రాధ పాల్గొన్నారు.

కలప స్మగ్లింగ్‌పై కఠిన చర్యలు

- చెట్ల నరికివేతపై విచారణకు డీఎఫ్‌వో ఆదేశం

సాక్షి ఎఫెక్ట్

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్, ఖానాపూర్ బీట్లలో పలుమార్లు భారీ టేకు చెట్లను నరికివేసి కలప స్మగ్లింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఖానాపూర్ ఎఫ్‌ఆర్వో కిరణ్ తెలిపారు. 'రోడ్డు పక్కనే వన మేదం'శీర్షికన శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. చెట్ల నరికివేతపై ఇప్పటికే విచారణ చేపట్టామన్నారు. తమ ప్రాథమిక విచారణలో నలుగురు కలప స్మగ్లింగ్‌కు పాల్పడినట్లు గుర్తించామని తెలిపారు. కాగా, స్మగ్లర్లు తరలించిన కలప విలువ రూ.75 వేలు, నరికి వేసిన చెట్ల దుంగల విలువ రూ.42 వేలు ఉంటుందని తెలిపారు. కాగా, పత్రికలో వచ్చిన కథనానికి నిర్మల్ డీఎఫ్‌వో నాగినిబాను స్పందించారు. కలప స్మగ్లింగ్‌పై సమగ్ర విచారణకు ఆదేశించారు.

కోజ్జన్‌గూడ శివారులో పులి సంచారం?

- కుక్కపై దాడిచేసి హతమార్చిన వైనం



కుక్క కళేబరం

తాంసి: భీంపూర్ మండలం కరంజి(టి), కోజ్జన్‌గూడ శివారుల్లో పులి సంచారం కలకలం రేపింది. కోజ్జన్‌గూడ శివారు సూర్యగుట్ట అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం కుక్కపై పులి దాడి చేసి హతమార్చినట్లు గ్రామస్తులు గుర్తించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. సూర్యగుట్ట అటవీ ప్రాంతం మహారాష్ట్రకు సరిహద్దు ఉండటంతో పులి అక్కడి నుంచి వచ్చిందా లేక చిరుతపులి దాడి చేసి హతమార్చిందా విషయం తెలియాల్సి ఉంది. కాగా, అక్కడ పులి సంచరించినట్లు ఆనవాళ్లు లేవని అర్లి(టి) సెక్షన్ అధికారి మోపత్‌రావు తెలిపారు. కుక్కపై హైనా దాడి చేసి ఉండవచ్చునని అనుమానించారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు



ప్రయాణికులను సన్మానిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం, ఉద్యోగులు

ఆదిలాబాద్: ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో శుక్రవారం మర్యాద దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు ప్రయాణికులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ప్రయాణికుల విషయంలో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రణీత్, డీఎం కల్పన, అకౌంట్స్ ఆఫీసర్ శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుకలో దిగబడిన ట్రాక్టర్

- బయటకు తీసే క్రమంలో ప్రమాదం
- ట్రాక్టర్ డ్రైవర్ మృతి



శేఖర్ మృతదేహం

దండేపల్లి: గోదావరి నదిలో దిగబడిన ఇసుక ట్రాక్టర్‌ను బయటికి తీస్తుండగా ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందాడు. మండలంలోని గుడిరేవు వద్ద శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిరేవు గోదావరినది వద్ద ఇసుక ట్రాక్టర్ నదిలో దిగబడింది. దాన్ని మరో ట్రాక్టర్‌కు టోచన్ కట్టి బయటకు తీసే క్రమంలో మాదాపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మంత్రి శేఖర్(33) మృతిచెందాడు. దిగబడిన ట్రాక్టర్‌ను మరో ట్రాక్టర్‌తో బయటికి లాగేందుకు శేఖర్ రెండింటి మధ్యలో నిలబడి తాడు కడుతున్నాడు. ఈ సమయంలో ముందుకు లాగే ట్రాక్టర్ ఒక్కసారిగా అదుపుతప్పి రివర్స్ రావడంతో మధ్యన ఇరుక్కుపోయి తీవ్రగాయాలయ్యాయి. దీంతో వెంటనే లక్సెట్టిపేట ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందించే లోపు మృతిచెందాడు. ఈవిషయమై ఎస్సై ఉదయ్‌కిరణ్ సంప్రదించగా ప్రమాదం జరిగింది వాస్తవమే కాని, తమకు ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

చింతలమానెపల్లి: జీవితంపై విరక్తితో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని గూడెం గ్రామానికి చెందిన చౌదరి రూపేష్(24) గురువారం మధ్నాహం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. సాయంత్రం తల్లిదండ్రులు వచ్చి చూసేసరికి అపస్మారక స్థితితోకి వెళ్లిపోయాడు. వారు వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి చౌదరి మొండి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న మల్లయ్య

జైపూర్: మండలంలోని ఇందారం బస్టాండ్ వద్ద శుక్రవారం రాత్రి బైక్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై నాగరాజు కథనం ప్రకారం ...ఇందారం గ్రామానికి చెందిన సుంకరి మల్లయ్య పనినిమిత్తం బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా శ్రీరాంపూర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న బైక్ అతివేగంగా మల్లయ్యను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన అతన్ని మంచిర్యాలకు తరలించి వైద్యం అందించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో డ్రైవర్‌కు..

భీమిని: కన్నెపల్లి మండలం బొత్తపల్లి శివారు పంట పొలంలో దమ్ము (జంబు) కొడుతున్న ట్రాక్టర్ డ్రైవర్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. బొత్తపల్లికి చెందిన లాట్కురి రవి ట్రాక్టర్‌తో పంట పొలంలో శుక్రవారం దమ్ము కొడుతుండగా అక్కడ 11కేవీ విద్యుత్ తీగలు కర్రలతో వేసి ఉన్నాయి. గమనించని రవి ట్రాక్టర్ వెనుకకు తీస్తుండగా కర్రకు తగలడంతో విద్యుత్ తీగలు అతనిపై ముఖంపై పడింది. తీవ్రగాయాలైన క్షతగాత్రుడిని స్థానికులు ప్రైవేటు వాహనంలో మంచిర్యాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వాహనాల వేలం



వేలం వేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో వివిధ కారణాలతో సీజ్ చేసిన వాహనాలకు శుక్రవారం వేలంపాట నిర్వహించారు. మొత్తం 19 వాహనాలకు 16 వాహనాల వేలం పూర్తయినట్లు జిల్లా సూపరింటెండెంట్ ఎండీ రజాక్ తెలిపారు. వీటి విలువ రూ.1,34,000 నిర్ధారించగా.. రూ.2,07,900లకు వేలం పలికింది. జీఎస్టీతో కలిపి మొత్తం రూ.2,62,282 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఎక్సైజ్ సీఐ లక్ష్మణరావు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.